# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. గతేడాది ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టపోయిన రైతులకు 847 కోట్ల రూపాయల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

**2. వాతావరణంలో మార్పులతో ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం సూచనలు జారీ చేసింది.**

**3. మధుమేహం, గుండె, కాలేయ సంబంధిత సమస్యల చికిత్సలో వినియోగించే 41 రకాల మందులు, ఆరు రకాల ఫార్ములేషన్ల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించింది.**

**4. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆర్జిత సేవా టికెట్ల కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం రేపు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.**

**5. రక్తపోటుపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రపంచ అధిక రక్తపోటు అవగాహనా దినం ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సమయంలో కరువు, మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపింది. 2023 ఖరీఫ్‌లో కరువు బారినపడిన రైతులకు, గత డిసెంబరులో మిచౌంగ్ తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఇనపుట్ సబ్సిడీ చెల్లింపులకు ఈ ఏడాది మార్చి 6వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి విడుదల చేయగా, ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు రైతుల ఖాతాలకు నగదు జమ కాలేదు. ఎన్నికలు ముగియడంతో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద 847 కోట్ల రూపాయల చెల్లింపులకు ఆర్థికశాఖ పరిపాలన ఆమోదం, బడ్జెట్ విడుదలకు గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

-------------------------

ఇటీవల వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యల వంటి వ్యాధుల బారినపడుతున్నారు. వీటి నియంత్రణ చర్యల్లో భాగంగా 2024-25 సంవత్సరం నుంచి ఐదేళ్లపాటు ఎలాంటి చర్యలు తీసుకోవాలో రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం సూచనలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర

స్థాయిలో, జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు తయారుచేసి పంపాలని కోరింది. రాష్ట్రాల నుంచి వచ్చే ప్రణాళికలకు అనుగుణంగా.. కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులను మంజూరు చేస్తుంది.

---------------------------

మధుమేహం, గుండె, కాలేయ సంబంధిత సమస్యల చికిత్సలో వినియోగించే 41 రకాల మందులు, ఆరు రకాల ఫార్ములేషన్ల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ధరలు తగ్గించిన మందుల్లో కొన్ని యాంటీబయాటిక్స్, మల్టీవిటమిన్లు, యాంటాసిడ్స్ ఉన్నాయి. ధరల తగ్గింపునకు సంబంధించి నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ.. ఎన్‌పీపీఏ నిన్న ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ధరల తగ్గింపుపై డీలర్లకు వెంటనే సమాచారం ఇవ్వాలని, తగ్గింపును తక్షణమే అమలు చేయాలని ఔషధ తయారీ కంపెనీలను ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల కొన్ని రకాల మందుల ధరలు భారీగా తగ్గనున్నాయి.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆర్జితసేవా టికెట్ల కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం రేపు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవాటికెట్ల కోటా, శ్రీవారి ఆలయంలో ఆగస్టు 15వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహించే వార్షిక పవిత్రోత్సవాల సేవా టికెట్లను ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన ఆగస్టు నెల కోటాను ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఆగస్టు నెలకు సంబంధించిన అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను ఈనెల 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్ల కోటాను అదే రోజు ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే డీఈడీసెట్-2024కు సంబంధించిన హాల్‌టికెట్లు అందుబాటులోకి తెచ్చామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ తెలిపారు. పాఠశాల విద్య కమిషనర్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నిన్న ఆయన ఒక ప్రకటనలో సూచించారు. ఈనెల 24వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. అభ్యర్థి పేరు, తండ్రి పేరు, ఆధార్ నంబరు, మీడియం విషయాల్లో తప్పులు ఉంటే 81250 46997, 81219 47387 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే, తప్పులు సవరించి కొత్త హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచుతామని కమిషనర్ పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి తిరిగి అధికారంలోకి రాబోతోందని ఆ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. నిన్న ఆయన విజయవాడలో ఐప్యాక్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల సరళిపై చర్చించిన అనంతరం జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 2019లో 151 అసెంబ్లీ, 22 పార్లమెంటు స్థానాల్లో గెలుపొందామని.. ఈసారి అంతకంటే ఎక్కువ స్థానాల్లో విజయం సాధించే అవకాశం ఉందని అన్నారు.

---------------------------

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని, అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.షన్మోహన్ అధికారులను ఆదేశించారు. ఈరోజు ఉదయం చిత్తూరులోని ఎస్వీ సెట్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా షన్మోహన్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు శాసనసభ స్థానాలకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ కార్యకలాపాలు, సేవల్లో పారదర్శకత పెంపునకు ఈ–ఆఫీస్ వెబ్ అప్లికేషన్ సామర్థ్యం మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు నిలిపివేయాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కోరారు. ఈ మేరకు నిన్న ఆయన గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు లేఖ రాశారు. ఈ–ఆఫీస్ మూసివేతపై అనుమానాలు వ్యక్తం చేసిన చంద్రబాబునాయుడు మరికొన్ని రోజుల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడనున్న సమయంలో వెబ్ అప్లికేషన్ సామర్థ్యం మెరుగుపరచాల్సిన అవసరం లేదని లేఖలో పేర్కొన్నారు. కాగా.. ఈ–ఆఫీస్ సామర్థ్యం మెరుగుపరిచేందుకు ఈరోజు నుంచి ఈనెల 25వ తేదీ వరకు నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ – ఎన్ఐసీ షెడ్యూల్ విడుదల చేసింది.

---------------------------

ఏలూరు జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించిన రిటర్నింగ్ అధికారులందరినీ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఓట్ల లెక్కింపు ప్రక్రియనూ ప్రశాంతంగా పూర్తి చేసేందుకు సన్నద్ధం కావాలని కోరారు. జిల్లాలో పోస్టల్ బ్యాలట్‌తో కలిపి 84.82 శాతం పోలింగ్ నమోదైందని, ఇది గత ఎన్నికల కంటే ఎక్కువ అని కలెక్టర్ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో తనకు మద్దతుగా ప్రచారం చేసిన వారికి జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు నిన్న ఆయన ఒక లేఖను విడుదల చేశారు. అందులో పిఠాపురం నియోజకవర్గంలో తనకోసం ప్రచారం చేసిన తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధికి నమూనా నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీఇచ్చారు.

---------------------------

తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో పద్మావతీ పరిణయోత్సవం ఈరోజు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవం వైభవంగా జరుగనుంది. ఈ ఉదయం శ్రీదేవి భూదేవి, శ్రీనివాసుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మలయప్పస్వామి గజవాహనంపై విహరించారు. ఉత్సవాల నేపథ్యంలో ఈ మూడు రోజులు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను తిరుమల తిరుపతి దేవస్థానం రద్దు చేసింది.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

**......వాయిస్ 25 సెకన్లు.....**

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నౌకాశ్రయం కేవలం 45 రోజుల వ్యవధిలో పది మిలియన్ టన్నుల సరకు రవాణా చేసి సరికొత్త రికార్డు నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో పది మిలియన్ టన్నుల సరకు రవాణాకు 47 రోజుల సమయం పట్టగా ఈసారి రెండు రోజుల ముందే ఆ రికార్డు సాధించింది. ఈ ఘనత సాధించినందుకు ట్రాఫిక్ మేనేజర్ జీఆర్‌వీ ప్రసాదరావును, బృందాన్ని పోర్టు చైర్మన్ అంగముత్తు అభినందించారు.

---------------------------

ఈరోజు ప్రపంచ అధిక రక్తపోటు అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. రక్తపోటుపై ప్రజలకు అవగాహన కల్పించి... ఈ వ్యాధిని నివారించడానికి, నియంత్రించడానికి అన్ని దేశాల పౌరులను ఆ దిశగా ప్రోత్సహించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 2005వ సంవత్సరం నుండి ప్రతి ఏటా మే 17వ తేదీన ప్రపంచ రక్తపోటు అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం, ఒత్తిడి లేని ప్రశాంత జీవనం గడపడం, ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా సాధన చేయడం, ఆరోగ్య కరమైన ఆహారపు అలవాట్లు చేసుకోవడం వంటి కార్యక్రమాల ద్వారా అధిక రక్తపోటు నివారించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

======================